కథ

**త**ను కావాలనుకున్న కల సాకారమైన నేపథ్యంలో...

'తను' కావాలనుకున్న 'కల' నెరవేరని మనిషి కోసం...

'నీడ'ను సైతం కోల్పోయిన 'యిరు' మనసులు పడే తపనల సమాహారం...

ఫోన్ మోగింది నాజూగ్గా...

'హలో' అలవాటుగా అన్నా...

స్వర నగిషీలు చెక్కుతూ, వీణమెట్లపై జారిన ఆ రెండక్షరాల పదం, గమకాలు పోతూ, నరాల తంత్రుల మీటుతూ, మస్తిష్కం లోలోపలికి ప్రవహిస్తూ...స్తూ, వెనువెంటనే పరిసరాలను చైతన్యపరిచేలా... చందనం పరిమళం స్పృశించింది మనసును ఆహ్లాదపరుస్తూ...


గుండె... గుండెతో సంభాషిస్తున్నట్లున్న అనుభూతి... ఖండాంతర... సీమాంతర, ద్వీపాంతర స్పర్శ...

అయిదు నిమిషాలు... 'వూ'... అంటున్నానే కానీ... ఎంతవరకూ అవగతమయిందో అనుమానమే,

అక్షరాల్లోకి తర్జుమా అయినదానికంటే... ఆ స్వరాన్ని వింటూ... వింటూ... అనంత తీరాలకు ఆవలనున్న 'ఆ' సమక్షంలో నిలబడి... భూమి గుండ్రంగా వుందన్నది నిజమేనని చెప్పాలనిపిస్తూంటుంది.

# నిను వినా...

- లక్ష్మీనారాయణ



'సరే' అంటూ ఫోన్ పెట్టేసానో లేక ఫోన్ పెట్టేసాక "సరే" అన్నానో... యిప్పటికిప్పుడది అప్రస్తుతం... కానీ...

ఆముక్త:

అలసిన కనెప్పల మీద మునివ్రేళ్ళతో వ్రాసుకున్న లేపనం... చందనం స్పర్శ;

ఆముక్త:; పంచ కావ్యాల సారం,

పంచ నదుల సౌజన్యం,

పాంచ ప్రకృతీత్వం... ఆ సౌకుమార్యం

పంచ ప్రాణాల అమృతధార

సుస్వరాల మూర్తిమంతం ఆసాంతం...

రిక్త హస్తాల్లోంచి జారిన యిసుకలా వాస్తవం పాదాల ముందు బేలగా శ్వాసాను శ్వాసల వినమ్రగమనం

ఆముక్త;;; ఆమె సమక్షంలో గుండె కుందేలవుతుంది

అప్పుడే తుంచిన గడ్డి పరకవుతుంది

ఆమె చేతిలో... శారికలా హొయలు పోతుంది

వెన్నెల కూడా వెల వెల పోతుంది ఆ కనుల వెలుగు ప్రవాహంలో...

నిజానికి ప్రవాహం చాలా కఠినమైనది, స్వ-పర భేదమెరుగని వేగవంతమయిన ప్రయాణం... కాలం గూడా ప్రయాణం లాంటిదే, మనకు మనం కల్పించుకునేవే మిగతావన్నీ నిరంతరం...

ఆముక్తను నువ్వు నీ సొంతం కావాలనుకున్నావా?

...

ఆముక్త నిన్ను తనకు కావాలనుకోలేదా??

...

ఆ మౌనమే నిన్ను తినేస్తోంది మానసికంగా, ...రవీంద్ర, గొంతులో చిన్నగా నిరసన

ఏం చెప్పాలి... ఎలా చెప్పాలి...

***

ఆ సాయంత్రం, విశాఖ సముద్రం దగ్గర నిండు వెన్నెల్లో...

తామిద్దరూ... ఆమె కన్నులు... దూరంగా ఎక్కడో లంగరేసినట్లు...

చేతులు రెండూ మోకాళ్ళ చుట్టూ బిగించి ఒకింత స్వింగ్‌తో...

"ఏమిటీ మాట్లాడవ్",

"ఊ...;

"అనంత 'సాగరా'లు పిల్లకాలువల్లా మారుతున్నప్పుడైనా...

సుదీర్ఘ మౌనాలను ఒక్క మాటతో... ష్...

రేపు నేను బయల్దేరుతున్నాను..."

'ను' అన్న అక్షరం వత్తి పలుకుతూ... కింది పెదవి కుడివైపు వంచుతూ... ఒకింత నిర్లక్ష్యంగానే అయినా...

ఏదో తెలియని ఉద్వేగం...

కోయిలను వదలి వసంతం

మల్లెలను వదలి సౌరభం... ఎన్నాళ్ళయింది...

ఆలోచనలతో వత్తిగిలిన మనసును జ్ఞాపకాలు ముప్పిరి గొంటున్నాయి...

అలసిన తనాలకు వర్తమానాలే సుదీర్ఘాలనుకుంటా...

తను ఎందుకు వస్తోందో తెలియదు అయినా వస్తోంది... అది చాలు... ఎందుకు, ఏమిటీ, ఎలాంటి అసంగత విషయా

లతో... ఆమె వస్తోందనే నిజంతో తక్కువ చేసుకోవాలనిపించడం లేదు.

ఆమె వస్తోందనే భావనతో ఎందుకు వస్తోందో అని కూడా ఆలోచించడం లేదనుకోవచ్చు కూడా...


కనీసం... రెండున్నర దశాబ్దాల తర్వాత, ఎందుకు వస్తోందోనన్న ప్రశ్నకు జవాబు వెతుక్కోవడంకంటే... "వస్తోంది అన్న ఒక్క ఊహే చాలు.

ప్రస్తుతానికి... ఆపై సమక్షంలోనే... తెలుస్తుంది కదా... లేదా... ఊహించినదానికన్నా వాస్తవం భిన్నంగా ఉంటే తను యిప్పట్టున తట్టుకోలేడు... అంటే...

ఆశించినదాన్ని పొందలేకపోవడమనేది 'అలవాటైన' యిన్నాళ్ళకు కూడా అదే మరల... మరలా... పునరావృతం కాకూడదనే భావం బలంగా వుందేమో బహుశా... ఏది ఏమైనా ఆమె వస్తోందనేది నిజం...;

అయినా... పరిణామాలూ... పరిమాణాలూ... కొలతలూ... కొలమానాలూ కావుకదా... కావల్సింది... యిప్పటికైనా... ఎప్పటికైనా... మరి యింకిప్పుడు కావల్సింది...

ఏదో అద్భుతం జరగబోతోందనో... జరగాలనో అనుకోవడం కూడా.. స్వార్థం అనిపించుకోదూ... అందుకనే అనుకుంటా కేవలం ఆహ్వానం పలకడమనే తక్షణ ముమ్మర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం, తరువాత సంగతి... అది అప్పటి పరిస్థితులనుబట్టి అని కూడా నాకు ముందే తెలుసు, కనకనే... ఆశించడం, ఆశాభంగం చెందడమనే ముమ్మర ప్రక్రియలేవీ కనీసం సుదూర సమీపంలో పెట్టుకోవడం లేదు. అంతటి అవసరం కూడా వుంటుందనుకోవడం లేదు... అదే విచిత్రం...



మౌనంగా బయటకు వచ్చేసాను, కాగితాలన్నీ బేగ్‌లో సర్దేసి.... నేను విన్న ఆ శబ్దానికి మాటలు పొదగాలని చేసిన ప్రయత్నం ఫలించకపోగా... అసలా శబ్ద ప్రకంపనాలను సృష్టించిన 'ధీర వనిత' ఎవరో... తెలీలేదు. జయంతి పెళ్ళికని, ఆ వెన్నెల్లో ఎర్రమట్టి రోడ్డు మీంచి నడవడం బాగుంది.

***

"ఏమండోయ్... మగాళ్ళూ... మీరు కొంచెం బయటకు వెళితే మేం బట్టలు మార్చుకోవాలి".

అందాకా రాసుకుంటున్న నేను 'శబ్దం' వచ్చిన దిశగా గుమ్మంకేసి తలెత్తి చూసాను. నేనున్న గది నిండా పరచుకున్న డజన్ల కళ్ళు- సీతాకోకచిలుకల్లా రెపరెపమన్నాయి... నిశ్శబ్దంగా...

మౌనంగా బయటకు వచ్చేసాను, కాగితాలన్నీ బేగ్‌లో సర్దేసి.... నేను విన్న ఆ శబ్దానికి మాటలు పొదగాలని చేసిన ప్రయత్నం ఫలించకపోగా... అసలా శబ్ద ప్రకంపనాలను సృష్టించిన 'ధీరవనిత' ఎవరో... తెలీలేదు. జయంతి పెళ్ళికని, ఆ వెన్నెల్లో ఎర్రమట్టి రోడ్డు మీంచి నడవడం బాగుంది...

ఆ రోడ్డు బాగా కాగిన పాల రంగులో లోతెక్కడో... మెరకెక్కడో తెలీడం లేదు.

జయంతి మా క్లాస్‌మేట్, వాళ్లన్నయ్య రమణ ఒక సంవత్సరం సీనియర్. నిజానికి వాడూ నేను కలిసే చదవాల్సింది. కానీ టైఫాయిడ్ రావడంతో నేనొక సంవత్సరం పరీక్షలు రాయలేదు. అందువల్ల... అందుచేత... రమణ చెల్లెలు జయంతి మా క్లాస్‌మేటయింది. పైగా రమణా నేను అంతకుముందు నుంచే స్నేహితులమూ, సన్నిహితులమూనూ... అసలు వాడిని కూడా కలవొచ్చనికదా వచ్చాను...

ఆ వుదయం... పరిసరాల్నిండా సీతాకోకచిలుకలతో... వాసంత సమీరాల సమూహాలతో నందనవనాలవడం బాగుంది.

కొబ్బరి చెట్టు దగ్గర గల రాతి బెంచీపై కూర్చున్న నాకు సమీపంలో మువ్వల సవ్వడి...

"కాఫీ తీసుకోండి" ...అంటూ పెదాలు బిగించినా

గొంతులో... సుడి తిరుగుతూన్న... ప్రవాహావేగం... అల్లరి స్వరం...

పెద్ద గ్లాసులో కాఫీ.. మరో చిన్న గ్లాసులో మంచినీళ్ళు...

యిందాకా నేను విన్న 'శబ్దానికి' స్వరం అమరింది... లేదా... సమక్షంలో యిప్పుడు విన్న స్వరానికి... రూపు దిద్దుకున్న 'ఆకారం' ...స్వకారం... ఓంకారం... ఎక్కడో దూరంగా ప్రతిధ్వనిస్తున్న 'శబ్దాకారం'... వినమ్రంగా అంజలిస్తున్న ప్రవాహం గలగలలు...

"హలో; ...ఏమండోయ్;; కాఫీ వేడికి వేళ్ళు కాలుతున్నాయి కాస్త యీ లోకంలో కొచ్చి ఇది పుచ్చుకోండి..." అభ్యర్థన మిళాయింపు అయినా గొంతులో తగ్గని అల్లరి స్వరం... "అయినా కాఫీ యిచ్చేదిలా కాదనుకుంటా" ...అన్నాను కళ్ళతో గ్లాసులోని ద్రవాలను మార్చి చూపుతూ... అవును... అన్నట్లుగా కళ్ళు టప టపలాడిస్తూ... ఏదో అనబోయి ఎవరో పిలవడంతో... మంద్రంగా వెళ్ళిపోయింది.

ఆ వెనుకే మువ్వల శబ్దం.

"చందూ... యిక్కడున్నావా" అంటూ వచ్చింది పెళ్లికూతురు కళతో పరిసరాలకు మరిన్ని అందాలను అద్దుతూ... మరో పదిహేను గంటల్లో శ్రీమతి కాబోయే, కుమారి జయంతి.

పనుల హడావుడిలో వుదయం నించీ రమణ కనబడనేలేదనుకున్నాను.

"అన్నట్టు చందూ... కాఫీ తాగావా?"

"ఆ: పెద్దలోటాడు" ... అంటూ ... వుదయం జరిగింది చెప్పాను.

"అయితే... అదే అయ్యుంటుంది... చాలా సరదా అయిన మనిషి" ...అంటూంటే...

"ఏమిటీ.. అదే... అంటూ...ఏకవచనంతో కొంచెం చేసి మాట్లాడుతున్నారు... ఎవర్నీ..."

'కొంచెం' అనే మాటను వత్తిపలుకుతూ... వచ్చింది వుదయం కాఫీ యిచ్చినమ్మాయి.

"చెప్పాగా చందూ" ... అంటూ "రా... రావే... వీడు చందూ మా 'అన్నయ్య' కమ్ క్లాస్‌మేట్... కమ్... అన్నయ్య స్నేహితుడు..." అంటూంటే...

"అన్నన్నయ్యన్నమాట..." అంది రిథమిగ్గా వేళ్ళు కదుపుతూ... కళ్ళల్లో అల్లరి... అప్పట్లానే...

"ఈమె... ఆముక్త... మా కజిన్";

"ఈమె... మా యింటి పేరు కాదు, నా పేరు 'ఆముక్త... అసలు పేరు ఆముక్తమాల్యద" అంది. టీవీ యాంకర్లా... 'మాల్యద' అంటున్నప్పుడు స్పష్టంగా పెదిమ వంపు కనపడుతూ... వినబడేలా...

ఇంక ఆ రాత్రంతా ఆమె హడావుడే...

మౌనానికి పదాలద్దితే ప్రవాహ గమనమౌతుంది...

మౌనానికి రంగులద్దితే కోనసీమౌతుంది...

మౌనానికి నగిషీలద్దితే వెన్నెల పరచిన ఏరవుతుంది...

ఏ మలుపులో తానున్నా కనుతుదల పలకరింపు, జడవిసురులతో... మువ్వల సవ్వడులతో... పెదిమ విరుపులో... శబ్దం లేకుండా, చేకదలికలతో... గమనాలతో... నీడలా... జాడలా...

వేకువలా... సాయం నీలిమలో కలసిన పాల నురుగులా... గుక్క తిప్పుకోనివ్వకుండా... పరిసరాలను చైతన్యపరుస్తూ ఆహ్లాదపరుస్తూ... వేగిరపరుస్తూ... మల్లెల గుబాళింపులా... మొగిలి రేకులపై కురిసిన వెన్నెల్లా... ఆముక్త... ఆముక్త...::

గుండె నిండి పొర్లిపోతుందేమోనన్నంతగా, పదిలపరచుకున్నదాని కంటే మరిన్నింతల... యింతలింతలుగా భావాలు... ముప్పిరికొన్న కళ్ళు... ఆ కళ్ళ లోతుల్లో కనిపించే ఆ పచ్చదనం,

ఏ చిరుగాలి సవ్వడి విన్నా సంస్పందించే

కనురెప్పల రెపరెపల గమ్మత్తులు...

మనసు వేనవేల యింద్రధనస్సులొక్కటై నడయాడుతున్నట్లు... ఆముక్త:

నిండు వెన్నెల్లో వొలికిన చందనంలా, పగడపు పెదాల భరిణెలో దాగున్న శబ్దించని మాటల ప్రవాహం... ఆముక్త:

సీతమ్మధార బస్టాపు ఎదురుగా, రోడ్డు మీద... శ్వేతాంబరి...

ఉదయపు ఎండ ఆమె సహజారుణ పెదాల మీంచి ముక్కుపుడకపై వక్రీభవనం చెందుతూంది... ఆపై, పరిసరాలను ఆహ్లాదపరుస్తూన్న చందనం ఉనికి... చేతిలో పుస్తకాలు... నడచొస్తున్న నిలువెత్తు పాలనురుగులా... ఆమె... ఆమె... ఆముక్త::

కాల ప్రవాహంలో వేగం... సాయంత్రాలు కరిగి మంచు బిందువుల్లా ఆవిరైపోవడం... విశాఖ సాగర తీరంలో మరింతగా వన్నెలు పోతున్న వెన్నెల సొబగులు... 'ఆ' పాదాలు తాకాలని ఆరాటపడుతూ... ఉరకలెత్తి వస్తున్న కెరటాల పొర్లాటలు... చెర్లాటలు... అల్లంత దూరంలోనే... వెనక్కి వెళ్ళిపోవడాన్ని నిశితంగా పరికిస్తూ... వెండి ముత్యాల్లాంటి నురుగు గొలుసులతో 'ఆ' పాదాలను అలంకరించాలని... తపన పడుతున్న అల్లరి కెరటాలు నిరాశగా వెనుతిరిగిన మరుక్షణం ఉవ్వెత్తున మరలా ప్రయత్నం... మరల... మరలా... ఆశాభంగం...

అయినా"చూస్తున్నావ్‌గా ఆకాశం, సాగరాలు ఎప్పుడైనా కలుస్తాయా"

"ఆ: అటు చూడు... సుదూరంగా... సముద్రం మీంచి యింకా దూరంగా... అక్కడ... ఖచ్చితంగా... కలుస్తాయి",

కొంగు పెదాలతో సుతారంగా పట్టుకుని... గొంతులో... అదే... అప్పటి అల్లరి స్వరం... గమకాలు పోతూండగా... "అద్సరే... ఏం నిర్ణయించుకున్నావ్"

"మనంగా వెళ్ళలేమని తెలిసినప్పుడు... నేనుగా... వెళ్ళాలి... వెళ్ళితీరాలి... తీరుతాను... తీరాలను దాటి... ఎల్లలు ఏమార్చి వెళతాను..."

"మరి కేవలం... రేపవలులా... మనం... ప్రపంచం అంచులను తాకుదాం...", అంటూ ఉద్వేగాన్ని అదిమిపట్టి... మరు నిమిషంలో... 'నా'... అనుకున్న 'నిజం'... "కాదు... కాదంటూ... నీడలా..." వెళ్లిపోయింది, కరిగిన నీరెండపై చీకటి విరులు పరచుకుంటున్న పరిసరాలు... 'నీడ' సైతం లేని పేదలా నేను యిక్కడే... యిలాగే... చకోరంలా... చాతకంలా... నిరాశ లావవుతున్న దశలోనూ... ఒకింత నిర్లిప్తంగా... బరువుగా... భారంగా...

కడుపులో వికారంగా ఆందోళన హోరు... హోరు... ఎక్కడో కుదుపు... అరికాళ్ళలో తడి... మరెక్కడో నరాలు చిట్లుతూన్న సవ్వడి మస్తిష్కంలో తుపాను హోరు...చిత్తడి... ఊపిరిలో కలసిన స్వేదం వాసన... ఎక్కడినుంచో దూరంగా జానకి వినిపిస్తోంది... "బ్రోచేవారెవరురా..."

ఇక్కడ జరిగిందంటూ ఏంలేదు... ఎవరూ... ఎవర్నీ... తమ తమ భావాలతో... ఆలోచనలతో...

ప్రలోభపెట్టలేదు... నిజానికి... కేవలం... ఉదయాలు ఎంత బాగుంటాయో... సాయంత్రాలు కూడా అంతగానూ బాగుంటాయి... కానీ... ఒక ఆలంబనగా... వొకరికొకరమనుకుంటూ... వారి వారి ప్రపంచాలలో అల్లుకున్న దగ్గరితనాలు... అంతే కేవలం... అయినప్పుడు... ఎవరు బాధపడాలి... ఎందుకోసమని... అంటే సమాధానం కోసం దిక్కులు వెదుక్కోవల్సిందే... అయినప్పుడు... అసలేమీ లేదా... అంటే... ఏమో... మరేమో... ఏమో... ఏమేమో... అవునేమో... కాదేమో... అసందిగ్ధం...

***

మనసంతా పరచుకున్న చందనం పరిమళం... తానొచ్చేది యీరోజే కావడంతో పరిసరాల్లో మల్లెల గుబాళింపులు... డ్రైవర్‌ను కాదని ఏర్‌పోర్టుకు దారిలో తీసుకున్న పూలగుత్తి సువాసనలు... యిప్పుడు కారంతా కర్పూరం కలగలిసిన వింత జమిలి పరిమళాలు... నాసికనూ... తద్వారా మస్తిష్కాన్నీ... జాగ్రతపరుస్తూ... బేగంపేట చౌరస్తాకు యివతల రెండు మూడు కిలోమీటర్ల మేరా భయంకరమయిన ట్రాఫిక్ జాం... నిమిషాలు గడుస్తున్నాయి పదులుగా... యిరవైలుగా.

ఏవేవో ప్లకార్డులతో భారీ ప్రదర్శన... నిరీక్షణలో సెకన్లకు విలువేంటి... అనంత నిరీక్షణ... నా ముందు నిరీక్షణ... ప్రక్కన నిరీక్షణ...

కనుచూపు పరచుకున్నంత మేరా నిరీక్షణ... వొక్కసారిగా... వళ్లంతా... చెమట... ఎక్కడో అసంతృప్తి... ఆందోళన... ఎందుకిలా... అకస్మాత్తుగా కళ్ళు బరువుతో వాలిపోతున్నాయి...

ఆ...ముక్త: ఆ...ముక్త: ఆ...ముక్త:

కుడిచేయి బలంగా స్టీరింగ్ మధ్య హారన్‌పై వత్తిడి... వత్తిడి... జేబు కింద గుండెలోన... చిరాగ్గా... అలజడి... అశాంతి... దరికానని.

యంత్ర సముదాయం... చెమట... నాలుక తడారిపోతూంది...

కనులు పొడారిపోతున్నాయి... వళ్లంతా చెమట... చిత్తడి... బరువెక్కిన గుండెల నిండా... అలజడి ఊపిరిలో కలసిన స్వేదం వాసన చెవిలో హోరు... హారన్ల హోరు... సముద్ర కెరటాల హోరు...

కడుపులో వికారంగా ఆందోళన హోరు... హోరు... ఎక్కడో కుదుపు... అరికాళ్ళలో తడి... మరెక్కడో నరాలు చిట్లుతూన్న సవ్వడి మస్తిష్కంలో తుపాను హోరు...చిత్తడి... ఊపిరిలో కలసిన స్వేదం వాసన... ఎక్కడినుంచో దూరంగా జానకి వినిపిస్తోంది... "బ్రోచేవారెవరురా..." సముద్రం... విశాఖ తీరం... వెన్నెల సాయంత్రాలు... సర్వీ చెట్లలోంచి వినవస్తూన్న గాలి అలల విసుర్లు సీతమ్మధార... శ్వేతాంబరి...ఆముక్త:

ఆముక్త సమక్షంలోకి మనసు ప్రవహిస్తోంది.

ఆవిరై అలుముకుంటోంది... నీరై స్పృశిస్తోంది...

పాదాల మీద వాలిన సీతాకోక చిలుకల శబ్దించని రెక్కల ఘోష...

ఆలోచనల హోరు... జ్ఞాపకాల ప్రవాహపు హోరు...

పెదాలు కదులుతున్నాయి... నిశ్శబ్దంగా... వాలిన కన్రెప్పల చివర ఒకే ఒక్క మౌక్తికం... ఆముక్త... కం

బుగ్గలపై ఘనీభవించిన సుప్త మౌక్తికం... ఆముక్త.

***

ఫోన్ మ్రోగుతోంది... నిర్విరామంగా

చేయి వణుకుతూండగా... అవును... నేనే... ఆముక్తను...

ఏర్‌పోర్టు నుంచి సికింద్రాబాద్ మీదుగా ఆటోలో వచ్చేశాను...

డ్రైవర్ చెప్పాడు... చందూ నా కోసమని ఏర్‌పోర్టుకి వెళ్లాడని... అవును... గొంతు పూడుకుపోతోంది... దుఃఖం...

మనసును నులిమేస్తున్నట్లుగా అలసిన రెప్పల్లో ఉబికిన కన్నీరు...

కాకూడదు... చందూకి... ఏం కాకూడదు... యెస్... వెళ్ళాలి... వెళ్ళిపోవాలి... యింక యిప్పుడు నాకు యింకేమీ అవసరం లేదు...

అవును... అవసరం లేదు... వస్తున్నాను... వచ్చేస్తున్నాను... చందూ ప్లీజ్... మరింతగా మనసు బేల అయిపోతూంది...

ఆటో పోనీ... ఎంత త్వరగా వీలైతే అంతగా... ఐ కాంట్ బేర్ దిస్... షిట్... ట్రాఫిక్ జాం... యింకిప్పుడేమీ నాకక్కరలేదు... చందూ... ప్లీజ్... ఐ వాంట్ యు ఓన్లీ...

యింతకాలం నేను... నాకు నేనే... బందీ అయిపోయాను... నే బతుకుతూన్న వాతావరణమూ... నాది కాదని తెలుసుకునేసరికే... నేను, నాకు, నాకు నేనే చాలా దూరం వెళ్ళిపోయాను... ఒంటరి అయిపోయాను... 'నా' నుంచీ నేను సముద్రాలు దాటి వెళ్ళానేకానీ... చందూ...

నాకు నేనే... నా చుట్టూ నేనే కట్టుకున్న కోటగోడలు... నేను ఏర్పరచుకున్న భ్రమావరణంలో... నాకు తెలీకుండానే బందీనైపోయాను... అవన్నీ వట్టి కాగితప్పూలని తెలుసుకునేసరికే కన్నీరింకిన గుండెల్లో... కాలం మనకు తెలీకుండానే... నడచిపోయింది... నేను కోల్పోయిందేమిటో తెలిసింది... అవును అప్పటికే... కంటి అగాధాల సుప్త కేన్వాసుపై లిఖించని చిత్రం ఏదో... ఏమో... ప్ఛ్...ప్ఛ్... చందూ... రెండున్నర దశాబ్దాలు... అవును... ఎంత సుదీర్ఘాలో... అన్నన్ని నిరీక్షణలు... ఎంతెంత దగ్గరతనాలో...అంతంత దూరాలు... తీరాలు... దాటినా... సంద్రాలు... నడచినా...ఇప్పటికయినా... నా ఉనికి ఏ కళ్ళల్లో వెలుగు నింపుతుందో... ఏ వూహా నా గుండెల్లోని తంత్రులను శ్రుతిపక్వంగా మీటుతుందో. తెలిసింది... చందూ... అందుకే రెక్కలు కట్టుకుని వచ్చేశాను...

చందూ... వచ్చేశాను... వ...చ్చే...శా...ను...

"తట్టుకోలేని ఉద్వేగపు అల" చందూని శాశ్వతంగా తీసుకుపోయింది.

కనీసం యిరవై నిమిషాలు ముందొచ్చినా... నిట్టూర్పు నిండిన కార్పొరేట్ హాస్పటల్...

అప్పుడే... వచ్చిన ఆముక్త గుమ్మంలో అచేతనంగా...